క్లుప్తంగా

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మహబూబాబాద్ అర్బన్: కాళోజీ వాకర్స్ సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ రక్తదానం శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వెంకన్న, అధ్యక్ష కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, సభ్యులు నాగయ్య, శ్రీనివాస్, విష్ణువర్ధన్, నాగేశ్వర్‌రావు, మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



డోర్నకల్: డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్ 10వ తరగతి విద్యార్థి ఆశిష్‌రాజ్ రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కాజీపేటలో జరిగిన జిల్లాస్థాయి పుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన ఆశిష్‌రాజ్ ఈనెల 5నుంచి భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాడు. ఆశిష్‌రాజ్‌ను హెచ్‌ఎం బండి నర్సింహరావు, పీఈటీ రవికుమార్, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, శంకర్, శ్రీనివాస్ అభినందించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



కురవి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వీరబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. గ్రామంలో అవసరమైన పనులను పంచాయతీ నిధుల నుంచి గుర్తించేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆయా పనులకు సంబంధించి నవంబర్ 30న గ్రామసభ నిర్వహించి పనులను ఆమోదింపజేసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

రైతు ధర్నాను విజయవంతం చేయాలి



తొర్రూరు రూరల్: రైతుల రుణాలను పూర్తిస్థాయిలో చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 4న తొర్రూరులో చేపట్టిన రైతు ధర్నా విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మంగళపెల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అరిపిరాల, మాటేడు, పోలెపెల్లి, వెంకటాపురం, కర్కాల, అమర్‌సింగ్, పెద్దమంగ్యా తండాల్లో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాలను నిర్వహించారు. మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావులు హాజరు కానున్నట్లు తెలిపారు.

మందుబాబులకు అడ్డా..

- మోడల్ మార్కెట్‌లో అసాంఘిక కార్యకలాపాలు
- రూ.కోట్లు వెచ్చించి నిర్మించారు.. లక్షణంగా వదిలేశారు



మోడల్ మార్కెట్‌లో మందుబాబులు వదిలేసిన ఖాళీ మందు బాటిల్, ఇతరత్రా

మహబూబాబాద్: కూరగాయలు, పువ్వులు, చికెన్, మాంసం విక్రయించే చిరువ్యాపారుల కోసం కోట్ల రూపాయలతో మోడల్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. పలు కారణాలతో కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉంది. ప్రధానంగా మందు బాబులకు అడ్డాగా మారడంతోపాటు ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు కూడా నిలయంగా మారింది. మూత్ర విసర్జన కూడా దానిలోనే చేయడంతో భవనం అంతా అపరిశుభ్రంగా మారడంతో దుర్గంధం వెదజల్లడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఆఫీసర్ క్లబ్ పక్కనే కోట్ల రూపాయలతో మోడల్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. కానీ పలు కారణాలతో చిరువ్యాపారులు ఆభవనంలో షాపులను ఏర్పాటు చేయడం లేదు. స్థానిక గాంధీపార్కులో ఏర్పాటు చేసిన షెడ్లలోనే కూరగాయల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. దీంతో మార్కెట్ భవనం నిరుపయోగంగా ఉండటంతో మందు బాబులకు అడ్డాగా మారింది. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మోడల్ మార్కెట్ భవనంను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గాలివానకు విరిగిన చెట్లు



డోర్నకల్: రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

డోర్నకల్: మండలంలో బుధవారం రాత్రి ఒక్కసారిగా ఈదురుగాలలు రావడంతో స్థానిక సాయినగర్‌లో సెయింట్ ఆగ్నేస్ పాఠశాల మార్గంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలింది. విద్యుత్ వైర్లు తెగడంతో విద్యుత్ సరఫరా నిలిచింది. విద్యుత్ సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామ పరిధిలోని ప్రధాన రహదారిపై చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్సై చిర్ర రమేష్‌బాబు పోలీసు సిబ్బందితో వెళ్లి విరిగిన చెట్లను తొలగించారు.

నెహ్రూసెంటర్: జిల్లా ల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వివేకానంద సెంటర్‌లో ఇనుప విద్యుత్ స్తంభం విరిగి వంగిపోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కరాటేతో శక్తి సామర్థ్యాల పెంపు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్ ఎమ్మెల్సీ రవీందర్‌రావు, తదితరులు

మహబూబాబాద్ రూరల్: ఆత్మరక్షణకు దోహదపడే కరాటే నేర్చుకోవటం ద్వారా శక్తి సామర్థ్యాలు పెంపొందుతాయని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. మానుకోట కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి షోటో కాన్ కరాటే పోటీల పోస్టర్లను పట్టణంలోని గాంధీపార్కు వద్ద బుధవారం వారు ఆవిష్కరించారు. నవంబర్ 17న రాష్ట్రస్థాయి షోటో కాన్ కరాటే పోటీల్లో పాల్గొని విద్యార్థులు తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఈరు నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఘనపురపు అంజయ్య, బి.అజయ్ సారధిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదు



మాట్లాడుతున్న సతీష్

కేసముద్రం: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కు లేదని ఇనుగుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కూరెల్లి సతీష్ అన్నారు. బుధవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇనుగుర్తి మండలం కోసం పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతున్న సమయంలో, గత్యంతరంలేకనే ఆనాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంగా ప్రకటించిందన్నారు. పై నుంచి మేచరాజ్‌పల్లి వాసులతో స్టే ఇప్పించి, ఇనుగుర్తి అభివృద్ధిని అడ్డుకున్నది బీఆర్‌ఎస్ అని విమర్శించారు. త్వరలోనే ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతోపాటు, అన్ని విధాలుగా అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, కుమార్, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి



కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న కంపెనీ చైర్మన్

మరిపెడ/మరిపెడ రూరల్: మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలని విద్యా హెర్బ్స్ కంపెనీ ఫౌండర్, చైర్మన్ కోడిములె శ్యామ్ ప్రసాద్, కంపెనీ డైరెక్టర్ శ్రీవిద్య అన్నారు. సీఎస్ఆర్ యాక్టివిటీస్‌లో భాగంగా అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 35 మంది వితంతులవులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, కాంగ్రెస్ నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, యూత్ నాయకులు నర్సింహారెడ్డి, కౌన్సిలర్ పరశురాములు, మహిళలు, కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు



నెహ్రూసెంటర్: సంఘం జెండా ఆవిష్కరిస్తున్న రామ్మూర్తి

నెహ్రూసెంటర్: దళిత, బడుగు, పీడిత వర్గాల ప్రజల ఐక్యత కోసం కేవీపీఎస్ పని చేస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో సంఘం జెండాను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీపిరి యాకయ్య, మందుల మహేందర్, అల్వాల ఆనంద్, మచ్చ వెంకన్న, దైద సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జిన్న లచ్చయ్య, సైదులు, ఎర్ర వెంకన్న, ప్రసాద్, ఉదయ్, రామ్మూర్తి, చింత వెంకటేష్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత మృతి

నెల్లికుదురు: కుటుంబ కలహాలతో ఓ వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని రామన్నగూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన గుగులోతు కవిత (40) ఆర్థిక ఇబ్బందులతో కటుంబ కలహాలు పెరిగినట్లు తెలిపారు. క్షణికావేశాని లోనైన కవిత ఈనెల 1న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందింది. మృతురాలు తండ్రి బానోతు బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

నెల్లికుదురు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామ శివారు సర్వన్ తండా (కొత్త తండా)లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామ శివారు సర్వన్ తండా (కొత్త తండా)కు చెందిన బానోతు సైదులు(28) గత నెల 29న హనుమకొండ పరిధిలోని బీమారం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఆటో, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో సైదులు తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య మమత, కుమారుడు, కూతురు ఉన్నట్లు ఉన్నారు.

ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా తీరొక్క పూల ప్రకృతి పండగా బతుకమ్మ వేడుకను సంప్రదాయబద్ధంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ పండగను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల తీరొక్క పూలను అందగా పేర్చి బతుకమ్మలను తయారు చేసి ఆయా గ్రామాల్లోని చెరువుల వద్దకు వెళ్లి ఆడిపాడారు. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో అంటూ.. సందడి చేశారు. అనంతరం చెరువుల్లో బతుకమ్మలను వదిలారు. - సాక్షి నెట్‌వర్క్



తొర్రూరు: బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి





మానుకోటలో బతుకమ్మలతో యువతులు



కురవి వీరన్న సన్నిధిలో..



మహబూబాబాద్ రూరల్: నడివాడ గ్రామంలో..



కేసముద్రం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిన్నగూడూరు: రామాలయంలో..



గార్ల: పెద్ద బతుకమ్మను రిక్షాపై తీసుకెళ్తున్న మహిళలు



పెద్దవంగరలో కోలాటం వేస్తున్న మహిళలు.



నెల్లికుదురు: మునిగలవీడులో..



గూడూరు: శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో..



దోర్నకల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సంక్షిప్త సమాచారం

టీచర్స్ కాలనీగా నామకరణం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలోని గుప్తా వీధికి టీచర్స్ కాలనీగా నామకరణం చేశారు. బుధవారం కాలనీ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డులను మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోటు జనార్దన్, సీపీఎం నాయకులు బొమ్మన అశోక్‌కుమార్, జె.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు సన్మానం

గార్ల: గార్లలోని బస్టాండ్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు శ్రమదానం ద్వారా పరిసరాలను పరిశుభ్రం చేశారు. స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమం ముగింపు రోజైన బుధవారం గార్ల గ్రామ పంచాయతీ కార్మికులకు ఎంపీడీఓ మంగమ్మ ప్రశంస పత్రాలతోపాటు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్, సిబ్బంది కిశోర్, కలీం, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

లైన్‌మెన్‌కు..

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌మెన్ యశ్వంత్‌ను, పలువురు అధికారులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఇనుగుర్తిలో రికార్డు స్థాయిలో భారీవర్షాలు కురిసిన సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేశాడని పలువురు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కృష్ణవేణి, ఎంపీఓ హరిప్రసాద్, హెచ్ఈఓ భిక్షపతి, సెక్రటరీ లక్ష్మీకాంత్, దార్ల రామ్మూర్తి, తమ్మడపల్లి కుమార్ పాల్గొన్నారు.

డీఎస్సీ ర్యాంకర్‌కు..

తొర్రూరు రూరల్: మండలంలోని అమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇటీవల డీఎస్సీ ఎస్జీటీలో మొదటి ర్యాంక్ సాధించిన మాచర్ల రామూర్తి, శోభ దంపతుల కుమారై లక్ష్మీభవానీని సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ స్పెషల్ అధికారి వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రావణి, హెచ్ఎం యాకుబ్‌రెడ్డి, ఏపీఓ మధు, టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

కురవి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకుడు గంధసిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీ, చెంచు కాలనీని సీపీఎం బృందం పరిశీలించారు. కృష్ణయ్య, వెంకన్న, జ్యోతిబసు పాల్గొన్నారు.

కులమతాల మధ్య చిచ్చు

బయ్యారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జగ్గు తండా పంచాయతీలోని బుడగజంగాలకాలనీలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు రాజన్న, మధు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.10వేల ఆర్థికసాయం

కురవి: మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండాలో బాధిత కుటుంబానికి విజయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాలోత్ రామారావు బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. హరిదాసు తండాలో ధరావత్ సుధాకర్ కుమార్తె అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు విజయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాలోత్‌రామారావు స్పందించి రూ.10వేల చెక్కును సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ధరావత్ వెంకన్న, సుందర్‌లాల్, వీరన్న, రమేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

మరిపెడ రూరల్: దంతాలపల్లి మండలం నిదానపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జినక స్వామి అన్నారు. బుధవారం మండలంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రంగన్న పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇవ్వాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో అత్యధికంగా లంబాడీ సామాజిక వర్గం జనాభా అధికంగా ఉందని జిల్లాకు సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ అన్నారు. సంఘం జిల్లా సమితి సమావేశం బుధవారం నిర్వహించారు.

పోలీసుల అదుపులో దొంగలు..!

కురవి: కురవి పోలీసుల అదుపులో ఐదుగురు దొంగలున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ట్రాలీ ఆటోలో ఐదుగురు వ్యక్తులు బుధవారం కురవి పోలీస్ స్టేషన్ పరిధిలోని బేతోలు సమీపంలో చోరీకి పాల్పడుతున్నట్లు గుర్తించి అక్కడి స్థానికులు వారి వద్దకు వెళ్లేందుకు యత్నించారు. దొంగలు వాహనాల బ్యాటరీలు, సెంట్రింగ్‌కు సంబంధించిన రేకులను చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వీరు ఖమ్మం జిల్లా వైరా ప్రాంతానికి చెందిన వారని తెలిసింది.

గాంధీ జీవితం స్ఫూర్తిదాయకం

జిల్లా వ్యాప్తంగా బుధవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అహింస, శాంతి, న్యాయం, సమానత్వం ఉద్యమాలు నడిపి అందరిని జాగృతం చేసిన జాతిపిత మహాత్మాగాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్: మున్సిపాలిటీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి



కురవి: సీరోలు మండలం చింతపల్లిలో..



మరిపెడ: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



పెద్దవంగరలో..



మహబూబాబాద్ అర్బన్: గాంధీ విగ్రహానికి పూల మాల వేస్తున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

కట్టుకాల్వలో పిచ్చి మొక్కల తొలగింపు



డోర్నకల్: డోర్నకల్ శివారు మున్నేరువాగు ఆనకట్ట నుంచి సీతారాంపురం వరకు ఉన్న కట్టు కాల్వలో పిచ్చి మొక్కల తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సమస్యను ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన నిధులు మంజూరు చేశారు. చివరి ఆయకట్టు రైతులైన కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, వడ్డె వెంకన్న, కొప్పుల వెంకటి తదితరులు పొక్లెయినర్ యంత్రంతో కాల్వలో పిచ్చి మొక్కలు తొలగించే పనులు చేపట్టారు. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.